ఆంధ్రప్రభ



# జూన్‌లో టెట్

(మొదటి పేజీ తరువాయి)

యోచిస్తోంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వేలాది ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఏటా డీఎస్సీ వేస్తామని ప్రభుత్వం ఏర్పాటుకు ముందే ప్రకటించింది. కానీ 2019 నుంచి ఒక్క డీఎస్సీనీ ప్రకటించకపోవడంతో.. కనీసం టెట్ అయినా నిర్వహిస్తే ఆ తర్వాత డీఎస్సీకి అవకాశాలు ఉంటాయని నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉంటే 2019, 20లో జనవరిలో జాబ్‌క్యాలెండర్ ప్రకటించిన ప్రభుత్వం గతేడాది జూన్‌లో ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా జూన్‌లోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తారని, అందులో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కూడా ఉంటుందని భావిస్తున్నారు. ఈ దిశగానే విద్యాశాఖ జూన్‌లో టెట్ నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది.

## ఒక్కసారి అర్హత సాధిస్తే చాలు

పాఠశాల విద్యాబోధనలో ప్రమాణాలు మెరుగుపరిచేందుకు జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి(ఎన్‌సీటీఈ) టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)ను ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు 'టెట్'ను నిర్వహించాల్సి ఉంటుంది. గతంలో టెట్‌లో అర్హత సాధించిన వారికి ఏడేళ్ల గుర్తింపు ఉండేది. అయితే సవరించిన నిబంధనల మేరకు ఒక్కసారి అర్హత సాధిస్తే జీవితకాలం వ్యాలిడిటీ ఉంటుంది. ఏపీ టెట్‌కు సంబంధించి.. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధించేందుకు(ఎస్‌జీటీ) పేపర్-1ఏ, ఆరో తరగతి నుంచి 8వ తరగతి వరకు బోధించేవారు (స్కూల్ అసిస్టెంట్) పేపర్-2ఏ రాయాల్సి ఉంటుంది.

## నియామకాల్లో వెయిటేజీ

ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరాలంటే అభ్యర్థులు డీఎస్సీ రాయాల్సి ఉంటుంది. అంతకు ముందు జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి(ఎన్‌సీటీఈ) నిబంధనల మేరకు టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. అలాగే టెట్‌లో ఉత్తీర్ణత సాధించినవారికి ఉపాధ్యాయ నియామక పోస్టుల్లో 20 శాతం వెయిటేజీ ఉంటుంది. టెట్ రాసేందుకు పేపర్‌ను బట్టి ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీతోపాటు డీఈడీ, బీపీఈడీ తత్సమాన కోర్సులు చదివి ఉండాలి. పూర్తి ఆన్‌లైన్ విధానంలో 150 మార్కులకు రెండున్నర గంటల పాటు నిర్వహించే ఏపీ టెట్ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. 1-5 తరగతుల టీచర్ పోస్టులకు పోటీ పడేవారు పేపర్ 1ఏకు; 6-8 తరగతుల టీచర్ పోస్టులకు పోటీ పడేవారు పేపర్ 2ఏకు హాజరవ్వాల్సి ఉంటుంది. ఆయా పోస్టులకు పేర్కొన్న అర్హతలు కలిగిన వారు రెండు పేపర్లకూ హాజరవ్వొచ్చు. టెట్ ప్రశ్నపత్రం మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. టెట్‌లో జనరల్ అభ్యర్థులు (ఓసీలు) కనీసం 60 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు పొందితేనే.. అర్హత సాధించినట్లు అవుతుంది.

## అసెంబ్లీ సమావేశాల్లోనూ డిమాండ్..

రాష్ట్రంలో 2018 నుంచి టెట్, డీఎస్సీ నిర్వహించకపోవడంపై ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో శాసన మండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు గళమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో దాదాపు 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అలాగే వందల పాఠశాలల్లో ఏకోపాధ్యాయ బోధన జరుగుతోందని వివరించారు. ఐదేళ్లుగా టెట్ నిర్వహించకపోవడంతో దాదాపు ఐదారు లక్షల మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ టెట్ నిర్వహణకు కసరత్తు చేస్తుండటం వారిలో ఆశలు రేకెత్తిస్తోంది.